సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం। 10। ఆగస్టు। 2023



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి. మార్కెట్‌కు 703 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



తగ్గిన టమాట ధర

టమాట ధర తగ్గింది. అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.88, కనిష్టంగా రూ.52 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం
36.1°/21.4°

జిల్లా వ్యాప్తంగా బుధవారం పగటి ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

పెనుకొండ మార్కెట్ యార్డు చైర్మన్‌గా శ్రీనివాసులు


దేవాంగం శ్రీనివాసులు

రొద్దం: పెనుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా కలిపి గ్రామ పంచాయతీ కె.మరువపల్లి గ్రామానికి చెందిన దేవాంగం శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈమేరకు మార్కెటింగ్ శాఖ నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ..తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి చేస్తానన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా



పుట్టపర్తి టౌన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈనెల 11న బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేస్తారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటిఐ, చదవి 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఇస్తారని, బెంగళూరు, చిత్తూరు, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రావాలన్నారు. పూర్తి వివరాలకు 7981541994, 9390176421 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

ఉత్తమ క్రీడాకారుల ప్రతిపాదనలు పంపండి

ప్రశాంతి నిలయం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 29న అవార్డులు అందించేందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు క్రీడాకారుల పేర్లు పంపాలని డీఈఓ మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆయా పాఠశాలల పరిధిలో వివిధ క్రీడాంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థుల పేర్లు, వివరాలు నమోదు చేసి ఈనెల 16వ తేదీలోపు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శికి ప్రతిపాదనలు పంపాలన్నారు.

అభివృద్ధికి పునరంకితమవుతాం

- ప్రతిజ్ఞ చేసిన ప్రజలు, అధికారులు


నిడిమామిడిలో శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

పుట్టపర్తి అర్బన్: 'ఆజాదీకా అమృత్ మహోత్సవం'లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 467 పంచాయతీల్లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 'దేశ నిర్మాణంలో మా వంతు కృషి చేస్తాం, దేశ ఐక్యతకు ఎల్లప్పుడు కృషి చేస్తాం, దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల స్ఫూర్తితో దేశాన్ని రక్షించుకుంటాం, అభివృద్ధికి పునరంకితమవుతాం' అని ప్రజలు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు 467 గ్రామ పంచాయతీల్లో శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. పాఠశాలలు, ఆర్‌బీకేలు, సచివాలయాల ఆవరణల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

తపాలా ఏఎస్పీగా కళ్యాణ్‌రామ్


కళ్యాణ్‌రామ్

పుట్టపర్తి టౌన్: తపాలా శాఖ హిందూపురం డివిజన్ ఏఎస్పీగా కళ్యాణ్‌రామ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ధర్మవరం సబ్‌డివిజన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న కళ్యాణ్‌రామ్‌కు ఏఎస్పీగా పదోన్నతి కల్పించి హిందూపురం సబ్ డివిజన్ కార్యాలయానికి బదిలీ చేశారు. గురువారం ఆయన హిందూపురం సబ్ డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

నవదంపతులకు పెళ్లి కానుక

- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా నిధుల విడుదల
- జిల్లాలోని 660 జంటలకు రూ.4.89 కోట్ల లబ్ధి
- మెగా చెక్కు అందజేసిన కలెక్టర్ అరుణ్‌బాబు, ప్రజాప్రతినిధులు
- జగనన్న సాయం మరువలేమంటున్న నూతన జంటలు


మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

పుట్టపర్తి అర్బన్: నూతన దంపతులకు సీఎం జగన్ సర్కార్ పెళ్లి కానుక ఇచ్చింది. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా నిధులు విడుదల చేసి ఆర్థికంగా అండగా నిలిచింది. ఖాతాల్లో డబ్బు జమ అయినట్లు సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు రాగానే నవదంపతుల మోముల్లో ఆనందం వికసించింది. కొత్త సంసారానికి సారె పంపినట్లు సీఎం జగనన్న తమకు ఆర్థిక సాయం చేశారని లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

మెగా చెక్కు అందజేత..

వివాహం చేసుకున్న వెంటనే కుటుంబ పోషణ భారం కాకూడదనే ఉద్దేశంతోనే నూతన దంపతులకు వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తోందని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఆర్థిక సాయం సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో వివాహాలు చేసుకున్న అర్హులైన దంపతులకు అందించే వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా నిధులను బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్ బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్, వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 660 జంటలకు సంబంధించి రూ.4.89 కోట్ల మెగా చెక్కును అందజేశారు.

జీవితాంతం గుర్తుండేలా...

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ... ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం జీవితాంతం గుర్తుండేలా ఒక మంచి కార్యక్రమానికి వినియోగించుకోవాలని సూచించారు. ఎస్సీ కేటగిరీ కింద 97 మందికి రూ.1 లక్ష చొప్పున రూ.97 లక్షలు, ఎస్సీ ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ చేసుకున్న నలుగురికి రూ.1.20 లక్షల చొప్పున రూ.4.8 లక్షల లబ్ధి కలిగిందని తెలిపారు. అలాగే ఎస్టీ కేటగిరీ కింద 53 మంది లబ్ధిదారులకు రూ.53 లక్షలు, ఎస్టీ ఇంటర్ క్యాస్ట్ కింద ఇద్దరికి రూ.2.4 లక్షలు, బీసీ కేటగిరీ కింద 350 మంది లబ్ధిదారులకు రూ.50 వేల చొప్పున రూ.1.75 కోట్లు, ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ చేసుకున్న ఏడుగురికి రూ.75 వేల చొప్పున రూ.5.25 లక్షలు, మైనారిటీ కేటగిరీ కింద 140 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున రూ.1.4 కోట్లు ఖాతాల్లో జమ చేశామన్నారు. అలాగే దివ్యాంగుల కేటగిరీలో ఐదుగురికి రూ.1.50 లక్షల చొప్పున రూ.7.5 లక్షలు, భవన నిర్మాణ కార్మికుల కేటగిరీలో ఇద్దరికి రూ.80 వేల చొప్పున నిధులు ఖాతాల్లో జమ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 660 మందికి సంబంధించిన రూ.4.89 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు.

జగనన్న మాటిస్తే తప్పడు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకసారి మాటిస్తే తప్పడని, నిరుపేదల విషయంలో చెప్పినదానికంటే ఇంకా ఎక్కువే చేస్తాడని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని అన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా చెక్కు పంపిణీ అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో కల్యాణమస్తు లబ్ధిదారులకు అరకొరగా నిధులు కేటాయించి పథకాన్ని సర్వనాశనం చేశారన్నారు. కానీ జగనన్న మాత్రం ఏ ఒక్క పథకం ఆగకుండా సకాలంలో నిధులు విడుదల చేస్తున్నారన్నారు. పేద పిల్లలను చదివించడంతో పాటు వారికి పెళ్లి చేసే బాధ్యతను నెత్తికెత్తుకున్నారన్నారు. దీనికి కట్టుబడి ఇప్పటి వరకూ వేలాది మందికి 'కల్యాణమస్తు' ద్వారా ఆర్థిక చేయూతనిస్తూ ఆయా కుటుంబాల్లో సంతోషాలను నింపుతున్నారన్నారు.

పాడి ఆవు కొనుక్కుంటా..



మాది నిరుపేద కుటుంబం. మా పెళ్లి కూడా నిరాడంబరంగా చేసుకున్నాం. కల్యామమస్తు ద్వారా అందే డబ్బుతో పెళ్లికోసం చేసిన అప్పు తీర్చేస్తాం. మిగిలిన మొత్తంతో సీఎం జగనన్న మాకు బహుమతి ఇచ్చినట్లుగా భావించి పాడి ఆవును కొనుక్కుంటా. ఇంట్లో పాడిఆవు ఉంటే ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి.

– గణేష్ నాయక్, శ్రావణి దంపతులు, పెదపల్లి తండా

మా కుటుంబానికి రూ.5 లక్షల లబ్ధి



సీఎం వైఎస్ జగన్ మా కుటుంబానికి ఈ నాలుగేళ్లలో రూ.5 లక్షల వరకూ ఆర్థిక సహాయం అందజేశారు. జలకళ, రైతు భరోసా, సున్నా వడ్డీ, డ్వాక్రా రుణమాఫీ, ఆసరా, చేదోడు, అమ్మఒడి ఇలా అన్ని పథకాల్లో మా కుటుంబానికి సాయం చేస్తున్నారు. జగనన్న లాంటి వ్యక్తి సీఎంగా ఉన్నంతకాలం మాలాంటి పేదలకు ఏ ఇబ్బంది ఉండదు.

– కౌసల్య, సంజేపల్లి, ముదిగుబ్బ మండలం

సద్వినియోగం చేసుకుంటాం



మాది పేద కుటుంబం. పెళ్లి ఖర్చు చాలా భారమనిపిచ్చింది. సీఎం జగన్ మాకు రూ.లక్ష ఇచ్చి ఆదుకున్నారు. ఈ మొత్తాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదుగుతాం. కల్యాణమస్తుతో పాటు మా కుటుంబానికి ఆసరా, జగనన్న తోడు, పథకాలలో ఆర్థిక సాయం అందుతోంది. పేదల కష్టాలు తెలుసుకుని అడగకముందే అన్నీ అందించే ఇలాంటి ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదు.

– అఫ్జల్, షహనాజ్ దంపతులు, గోరంట్ల

98-డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల సర్వీస్ రెన్యూవల్

రాప్తాడురూరల్: 98– డీఎస్సీ ఎంటీఎస్ పద్ధతిలో పని చేస్తున్న ఎస్జీటీల సర్వీస్‌ను 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి రెన్యూవల్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) కింద రాష్ట్ర వ్యాప్తంగా 4,534 మంది ఎస్జీటీలుగా పని చేస్తుండగా.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 485 మంది పని చేస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో వీరు జూన్ 1 నుంచి 2024 ఏప్రిల్ 30 వరకు పని చేయనున్నారు. మే నెలలో 'నోవర్క్–నోపే' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా రెన్యూవల్ ఉత్తర్వులు రాని కారణంగా ఈ విద్యా సంవత్సరం వీరికి ఇంకా జీతాలు పెట్టలేదు. రెన్యూవల్ ఉత్తర్వులు అందడంతో జీతాల విడుదలకు మార్గం సుగమమైంది. ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల ఎంటీఎస్ టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం


ఉత్తర్వులు అందుకుంటున్న కార్మికులు

అనంతపురం రూరల్: ఆప్కాస్ పరిధిలోకి తమను చేర్చి ఉద్యోగ భద్రత కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఉమ్మడి అనంతపురం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ నాల్గో తరగతి ఉద్యోగులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కింద పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వం ఇటీవల ఆప్కాస్ పరిధిలోకి చేరుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులను బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ రావు అందజేశారు. దీంతో ఉద్యోగులంతా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు, కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పయ్య, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యం


వేడుకల్లో ప్రసంగిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో వడిత్యా శంకర్‌నాయక్

- ప్రతి గిరిజన బిడ్డా చదువుకోవాలి
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్ నాయక్, డీఆర్‌ఓ కొండయ్య, గిరిజన సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి మోహన్‌రావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీసీహెచ్ ఎస్ తిప్పేంద్ర నాయక్, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, జెడ్పీటీసీలు లక్ష్మీనరసమ్మ, రాధాబాయి, జిల్లా మలేరియా నివారణాధికారి కుల్లాయప్ప నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చదువుతోనే తలరాత మారుతుందని, అందువల్ల గిరిజనులు తమ పిల్లలు తప్పక చదివించాలన్నారు. అప్పుడే వారు జీవితంలో గొప్ప విజయాలు సాధిస్తారని, తద్వారా మరో 10 మందికి సాయం చేయగలరన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం గిరిజనులకు మెరుగైన సేవలందిస్తోందన్నారు. త్వరలోనే జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో గిరిజనుల సంక్షేమం, పథకాల పురోగతిపై చర్చిస్తామన్నారు. ఆగస్టు 15న స్థానిక పరేడ్ గ్రౌండులో గిరిజనుల సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎస్టీ కేటగిరిలో యానాదులు ఎంత మంది ఉన్నారో గుర్తిస్తామన్నారు. అలాగే అర్హులందరికీ భూ పంపిణీ, గిరిజన భవన నిర్మాణం, బ్యాంకర్లను ఒప్పించి రుణాలు పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గిరిజనులకు ఏవైనా ఇబ్బందులుంటే నేరుగా తనను కలవాలని సూచించారు.

గిరిజనులకు అన్ని రంగాల్లో సహకారం..

ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ మాట్లాడుతూ... ఆదివాసీల హక్కుల పరిరక్షణకే ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ, పర్యావరణం, అభివృద్ధి, విద్య, వైద్య రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సహకారం అందించడమే ఆదివాసీ దినోత్సవం ఉద్దేశ్యమన్నారు. రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిషన్ రాష్ట్రంలో అన్ని గిరిజన ప్రాంతాల్లో పర్యటించి, సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఎస్టీ కమిషన్ పని చేస్తుందన్నారు. పుట్టపర్తిలో ఏకలవ్యుడు, బంజారాలాల్ విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కృష్ణా నాయక్, ఆనంద్ నాయక్, కల నాయక్, అజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ

- ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు
- ఇప్పటికే 55 శాతం ఓటర్ల వివరాల పరిశీలన
- 21వ తేదీలోపు పూర్తి చేసేందుకు చర్యలు


పుట్టపర్తి మండలం చెర్లోపల్లిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు

పుట్టపర్తి అర్బన్: తప్పులు లేని ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో భాగంగా 'ఓటరు సంక్షిప్త సవరణ–2024'కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా శరవేగంగా సాగుతోంది. ఎన్నికల సంఘం షెడ్యూలు ప్రకారం తొలుత జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకూ బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి తప్పుల్లేని ఓటరు జాబితాను తయారీకి వివరాలను సేకరిస్తున్నారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు మృతి చెందిన వారిని తొలగించడం, శాశ్వత వలసదారులను గుర్తించి సమాచారం ఇచ్చి తొలగించే కార్యక్రమాలను చేపట్టారు. ఈ సర్వే ప్రక్రియను ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

55 శాతం పరిశీలన పూర్తి ..

ఓటరు జాబితాను సవరణ ఈనెల 21వ తేదీ నాటికి వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలోని 13,41,077 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 6,72,887 మంది కాగా, మహిళలు 6,68,125 మంది ఉన్నారు. మరో 65 మంది ఇతరులు ఉన్నారు. వీరందరి వివరాలు పరిశీలించే క్రమంలో ఇప్పటికే బీఎల్‌ఓలు 55 శాతం కుటుంబాల సర్వే పూర్తి చేశారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటు బదిలీ, మృతుల ఓట్ల తొలగింపు, తప్పుల సవరణకు దరఖాస్తులు స్వీకరించి జాబితాను రూపొందిస్తున్నారు. ఇప్పటి వరకూ ఫారం–6 దరఖాస్తులు 6,756, ఫారం–7 దరఖాస్తులు 3,250, ఫారం–8 దరఖాస్తులు 6,400 వచ్చాయని కలెక్టర్ తెలిపారు.

పర్యవేక్షిస్తున్న ఆర్డీఓలు..

ఎన్నికల సంఘం ఇప్పటికే నియోజక వర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులను నియమించింది. దీంతో వారంతా బీఎల్‌ఓల నుంచి సర్వే వివరాలను ఎప్పటికప్పుడు తెప్పించుకుని పరిశీలిస్తున్నారు. ప్రతి మంగళవారం ఆయా రిటర్నింగ్ అధికారులు అన్ని పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు స్వీకరిస్తున్నారు.


నాటకం ప్రదర్శిస్తున్న చిన్నారులు


సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

సాయి కీర్తనం.. భక్త పరవశం


'సాల్వేషన్ త్రూ ట్రాన్స్‌ఫర్మేషన్' నాటికలో ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: సత్యసాయిని కీర్తిస్తూ హర్యానా, చండీఘడ్ భక్తులు చేసిన సంగీత కచేరీతో భక్తులు పరవశం చెందారు. పర్తి యాత్రలో భాగంగా బుధవారం పుట్టపర్తికి విచ్చేసిన భక్తులు సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మహిళా భక్తులు సాయికుల్వంత్ సభా మందిరంలో సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. సాయంత్రం హర్యానా, చండీఘడ్‌కు చెందిన బాల వికాస్ విద్యార్థులు మానసిక పరివర్తనతోనే మోక్షం సాధ్యం అన్న సందేశాన్నిస్తూ 'సాల్వేషన్ త్రూ ట్రాన్స్‌ఫర్మేషన్' పేరుతో నాటిక ప్రదర్శించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అంతకుముందు హర్యానా రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ప్రభాత్ గుప్తా తమ రాష్ట్రంలో జరుగుతున్న సత్యసాయి సేవా కార్యక్రమాలను వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి నూతన వస్త్రాలు జ్ఞాపికలను అందజేశారు.

యల్లనూరులో చైన్‌స్నాచింగ్

యల్లనూరు: వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలోని బంగారు గొలుసును ఓ దుండగుడు లాక్కెళ్లాడు. పోలీసులు తెలిపిన మేరకు.. యల్లనూరులోని పోస్టాఫీసు సమీపంలో నివాసముంటున్న లక్షుమమ్మ అలియాస్ లక్ష్మీదేవి బుధవారం ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడకు చేరుకుని తనకు అన్నం పెట్టాలని అడిగాడు. దీంతో ఆమె అన్నం తీసుకువచ్చేందుకు ఇంట్లోకి వెళుతుండగా వెనుక నుంచి ఒక్కసారిగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాగేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో ఆమె ప్రతిఘటించడంతో ముఖంపై బలంగా దాడి చేసి, బంగారు గొలుసు లాక్కొని ఉడాయించాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.


దుండగుడి దాడిలో గాయపడిన లక్షుమమ్మ

సంయుక్త కలెక్టరు వారి కార్యాలయము,
శ్రీ సత్యసాయి జిల్లా.
తేది : 09-08-2023

బహిరంగ వేలము ప్రకటన

శ్రీయుత జిల్లా సంయుక్త కలెక్టరు, శ్రీ సత్యసాయి జిల్లా వారి ఉత్తర్వుల నెం. Rc.No. K3/135/SSSD/2022, తేది : 09-08-2023 మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం జప్తు చేయబడి ఈ క్రింద తెలుపబడిన 12 మండల స్థాయి గోదాముల నందు నిల్వ ఉంచిన బియ్యమును పునఃవేలము వేయుటకు నిర్దేశించడమైనది.

సీజ్ చేయబడిన బియ్యం (Raw Rice) నిల్వ ఉన్న మండల స్టాక్ పాయింట్లు

క్రమ సంఖ్య	మండల స్థాయి గోదాము పేరు	వేలం నిర్వహించబడు సరుకు మొత్తం (క్వింటాళ్లలో)	బహిరంగ వేలము నిర్వహించు ప్రదేశము, తేది మరియు సమయం	దరఖాస్తు రుసుము మరియు ధరావత్తు	దరఖాస్తు పొందు ఆఖరు తేది, సమయం మరియు ప్రదేశం (డిస్ట్రిక్ట్ సప్లై ఆఫీసర్ ఆఫీస్, కలెక్టర్ ఆఫీస్, శ్రీ సత్యసాయి జిల్లా.)	దరఖాస్తు సమర్పించు చివరి తేది మరియు సమయం
1.	ధర్మవరం	302.56	కోర్ట్‌హాల్, కలెక్టరు కార్యాలయము, శ్రీ సత్యసాయి జిల్లా, ఆగస్టు 16వ తేది మధ్యాహ్నం 3-00 గంటలకు	రూ. 3000/- మరియు రూ. 2,00,000/-	బహిరంగ వేలము ప్రకటన ఇచ్చినప్పటి నుండి ఆగస్టు 16వ తేది మధ్యాహ్నం 12 గంటల వరకు (కార్యాలయ పనివేళలు మరియు పని దినాలలో)	ఆగస్టు 16వ తేది మధ్యాహ్నం 12 గంటల వరకు
2.	ముదిగుబ్బ	402.80				
3.	చెన్నేకొత్తపల్లి	248.05				
4.	పెనుకొండ	530.11				
5.	మడకశిర	12.10				
6.	హిందూపురం	381.10				
7.	తనకల్	117.59				
8.	కదిరి	144.23				
9.	గాండ్లపెంట	59.80				
10.	ఓబులదేవర చెరువు	335.70				
11.	బుక్కపట్నం	190.73				
12.	గోరంట్ల	25.00				
మొత్తము		2749.77				

నిబంధనలు : 1. బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు, వేలంలో బియ్యం కొనుగోలు చేయుటకు నిర్ణయించుకున్న ధరను దరఖాస్తు నందు తప్పనిసరిగా పొందుపరచవలెను. 2. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు District Supply Officer, Sri Sathyasai District వారి పేరు మీద చెల్లుబాటు అగునట్లు డి.డి. తీయవలెను. 3. కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంటు వారి లైసెన్స్ ఉన్న ట్రేడర్ / రైస్ మిల్లర్ అయి ఉండవలెను. 4. వేలము ముగిసిన అనంతరం అర్హత పొందని వారికి వేలం కోసం చెల్లించిన ధరావత్తు పైకమునకు సంబంధించిన రసీదు తీసుకొని డి.డి. తిరిగి ఇవ్వబడును. 5. బహిరంగ వేలంలో ఎక్కువ పాట పాడి అర్హత పొందిన వారు వేలం ముగిసిన 5 దినములలో మొత్తం పైకం చెల్లించి, పైకం చెల్లించిన 10 దినములలో సరుకును స్వాధీన పరచుకొని మరియు ఉపయోగించుకోవలెను. 6. వేలం పాటలో అర్హత పొంది నిర్ణీత సమయంలోమిగిలిన పైకమును చెల్లించని యెడల ధరావత్తుగా చెల్లించిన సొమ్ము (డి.డి) తిరిగి ఇవ్వబడదు.7. వేలం ద్వారా పొందిన బియ్యాన్ని మళ్లించడం లేదా స్టాకును దుర్వినియోగం చేయడాన్ని నిరోధించుటకు బియ్యం యొక్క తార్కిక ముగింపు వరకు స్టాకు ఉపయోగమును మరియు కదలికల విధానాన్ని రెవెన్యూ / పౌరసరఫరాలు / విజిలెన్సు మరియు ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గమనిస్తూ ఉంటారు. 8. వేలము వేయు సరుకును కార్యాలయ పనిదినములలో వేలము జరుపుటకు ముందు రోజులోపు, దానిని నిల్వ ఉంచిన ప్రదేశము అనగా, పై పట్టికలో కనపరచిన మండల స్థాయి గోదాముల నందు పరిశీలించుకొనుటకు అనుమతించబడును. 9. బహిరంగ వేలంలో ఎక్కువ వేలం పాడిన ట్రేడర్ / రైస్ మిల్లర్ వారు రవాణా మరియు హమాలి ఖర్చులను భరించి పై విడతల వారీగా మండల స్టాక్ పాయింట్ల నుండి బియ్యం తీసుకొనవలెను. 10. ఈ బహిరంగ వేలం అనేది జిల్లా సంయుక్త కలెక్టరు వారి తుది నిర్ణయానికి లోబడి ఉండును.

(For further Infirmation and appliction format visit http://srisathyasai.ap.gov.in/notice category/announcements/)

సం/- సంయుక్త కలెక్టర్ వారి తరపున, శ్రీ సత్యసాయి జిల్లా.

చిరువి తప్పుడు ఆలోచనలు

- తమ్ముణ్ని ఉన్నత స్థానంలో చూడాలనుకోవడంలో తప్పులేదు
- సినిమాలు ఫెయిల్ కావడంతో ప్రభుత్వంపై ఆరోపణలు తగవు
- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ (చిత్రంలో) ఎమ్మెల్సీ మంగమ్మ

పెనుకొండ: తమ్ముడు పవన్‌కళ్యాణ్‌ను ఉన్నత స్థానంలో చూడాలనుకోవడంలో తప్పులేదు కానీ, దురాలోచనతో ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని సినీ నటుడు చిరంజీవికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హితవు పలికారు. ఎమ్మెల్సీ మంగమ్మతో కలసి పెనుకొండలోని వజ్రాలపేటలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరును కొనియాడిన చిరంజీవి ఉన్నఫళంగా విమర్శలు చేయడం ప్రారంభించాడన్నారు. పవన్‌కళ్యాణ్ నటించిన సినిమాలు వరుసగా ఫ్లాప్ అవుతుండడంతో ఫ్రస్టేషన్‌కు లోనై ప్రభుత్వంపై అక్కసు వెల్లగక్కడం సరికాదన్నారు. ఏనాడూ ప్రత్యేక హోదాపై, ప్రత్యేక ప్యాకేజీ గురించి కాని, రాష్ట్రాభివృద్ధిపై చిరంజీవి మాట్లాడింది లేదన్నారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో ఈ రాష్ట్రానికి ఏం వెలగబెట్టారో సమాధానం చెప్పాలన్నారు. ఆయన హయాంలోనే ఈ రాష్ట్రం రెండు ముక్కలైందన్న విషయాన్ని గుర్తుంచుకుని మాట్లాడాలన్నారు. ఆ సమయంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదాను ఎందుకు సాధించలేకపోయారో చెప్పాలన్నారు. 2014 నుంచి 2019 వరకూ దీని గురించి కనీసం ఆలోచన కూడా చేయలేదన్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తమ్ముడిపై ప్రేమతో ప్రభుత్వంపై నిందలు మోపుతే సహించబోమన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్ చేపట్టిన కార్యక్రమాలను ప్రశంసించిన చిరంజీవి.. ప్రభుత్వం ప్రత్యేక హోదా సాధించలేదని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ఆయనలో వ్యక్తిత్వం నశించిందనేందుకు నిదర్శనమన్నారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబుల కోసం చిరంజీవి ఇంతలా దిగజారిపోతాడని ఆయన అభిమానులు సైతం కలలో కూడా ఊహించి ఉండరన్నారు. ఇప్పటికైనా చిరంజీవి తన ధోరణిని మార్చుకుని, వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలన్నారు.

బాబూ.. విద్రోహ చర్యలు మానుకో..

రాష్ట్ర ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం జగనన్న ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న పాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. ఈ విషయం గిట్టని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేనాని పవన్‌కళ్యాణ్ ఏకమై ముఖ్యమంత్రిపై, ప్రభుత్వంపై దూషణలకు దిగుతూ రోజూ ఏదోక హింసాత్మక ఘటనలకు తెరలేపుతున్నారన్నారు. పుంగనూరు ఘటనలో చంద్రబాబు స్వయంగా టీడీపీ గూండాలను రెచ్చగొట్టి పోలీసులపై దాడి చేయించి తన నీచ సంస్కృతిని బయటపెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం అవివేకమన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు విద్రోహ చర్యలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఏజీపీ భాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, వైశాలి జయశంకరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, గుట్టూరు అంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం తాకట్టుకు యత్నం

అమడగూరు: నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించిన మోసగాళ్లు చివరకు పోలీసులకు పట్టుబడ్డారు. వివరాలు... ఓడీ చెరువు మండలం గాజుకుంటపల్లికి చెందిన వెంకటస్వామి, బెంగళూరు నివాసి ప్రకాష్ ఇద్దరూ మిత్రులు. వీరిద్దరూ బుధవారం ఉదయం ఓడీచెరువులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో బంగారాన్ని తాకట్టు పెట్టి నగదు తీసుకునేందుకు వెళ్లారు. ఆ సమయంలో వారు చూపించిన బంగారాన్ని పరిశీలించిన మేనేజర్ కుసుమ.. అది నకిలీదని ధ్రువీకరించుకుని నిలదీసింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే ఇద్దరినీ పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితులను విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కదిరి అర్బన్: మండలంలోని పట్నం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.30,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ సూర్యనారాయణ తెలిపారు.

ఎస్కేయూతో ఎస్‌ఆర్‌ఐటీ ఒప్పందం


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఎస్‌ఆర్‌ఐటీ, ఎస్కేయూ ప్రతినిధులు

బుక్కరాయసముద్రం: ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, టెక్నాలజీ పురోగతిని పెంపొందించేలా ఎస్కేయూలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలకు ఊతమిస్తూ ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల మరో అడుగు ముందుకేసిందన్నారు. స్టార్టప్‌లను పెంపొందించడంలో భాగంగా వివిధ డొమైన్‌లలో వ్యవస్థాపక వెంచర్‌ల వృద్ధిని సులభతరం చేసేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఐఅండ్‌ఈడీపీ కన్వీనర్ డాక్టర్ ఆంజనేయులు, ఏఐసీ ఎస్కేయూ సీఈఓ డాక్టర్ శివకిరణ్, ఇంక్యుబేషన్ మేనేజర్ డాక్టర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి యాచకురాలి మృతి


మృతురాలు భాను

కదిరి టౌన్: మురుగు కాలువలో పడి ఓ యాచకురాలు మృతి చెందింది. కదిరి పట్టణానికి చెందిన దివ్యాంగురాలు భాను (32) యాచక వృత్తితో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో మద్యానికి బానిసై ఆమె రోడ్డు పక్కనే ఎక్కడిపడితే అక్కడ నిద్రకుపక్రమించేది. మంగళవారం రాత్రి మౌనిక థియేటర్ ఎదుట మద్యం మత్తులో నిద్రించిన ఆమె అదుపు తప్పి పక్కనే ఉన్న మురుగు కాలువలో పడిపోయింది. రాత్రి సమయంలో కావడంతో ఎవరూ గుర్తించలేదు. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన వారు మురుగు కాలువలో భాను మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యులు ఎవరూ లేకపోవడంతో అభిజ్ఞ ఫౌండేషన్ సభ్యుడు అలీకి మృతదేహాన్ని అప్పగించడంతో సభ్యుల సహకారంతో ముస్లిం శ్మశాన వాటికలో ఆమె మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే బూత్‌లో

- బూత్ స్థాయి అధికారులకు జేసీ చేతన్ సూచన


బీఎల్‌ఏ, బీఎల్‌ఓలతో సమావేశమైన జేసీ చేతన్

హిందూపురం: ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే బూత్ పరిధిలోకి చేర్చాలని బూత్ స్థాయి అధికారులకు జాయింట్ కలెక్టర్ చేతన్ సూచించారు. ఓటరు జాబిత నమోదు ప్రక్రియపై బుధవారం హిందూపురం నియోజకవర్గంలోని 253 బూత్ స్థాయి అధికారులకు బుధవారం స్థానిక టీటీడీ కల్యాణమంటపంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఓటరు నమోదుకు సంబంధించి వివిధ ఫారాలపై అవగాహన కల్పించారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఇంటింటి సర్వే ముఖ్యమన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఆరోగ్యకరమైన ఓటరు జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. మరణించిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించే అంశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సమావేశంలో ఈఆర్‌ఓ సురేష్, తహసీల్దార్ హసీనాసుల్తానా, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు

రాప్తాడురూరల్: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించాలని అనంతపురం డీఈఓ ఎం.సాయిరామ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 1 నుంచి 4 వరకు జరిగిన ఫార్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను తల్లిదండ్రుల సమావేశాల్లో ప్రదర్శించి చర్చించాలని పేర్కొన్నారు. విద్యార్థుల స్థాయిని మరింత పెంచడానికి చేయాల్సిన కృత్యాలపై చర్చ జరగాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు పెంపు. ట్యాబ్స్ వినియోగం, జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, వర్క్‌బుక్ - నోట్స్ పూర్తి చేయడం, పాఠశాలల్లో పరిశుభ్రత, నాడు-నేడు తదితర అంశాలపై చర్చించాలని సూచించారు. ప్రతి పాఠశాలలోనూ విధిగా తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం జరిగేలా ఎంఈఓలు, హెచ్‌ఎంలు చూడాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు ఈ సమావేశాలను పర్యవేక్షించాల్సి ఉంటుందని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏటా ఇస్తున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు దీపు కిరణ్‌రెడ్డి, సుంకర రమేష్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పదేళ్లకు పైగా బోధనతో పాటూ ఇతర రంగాల్లో సమాజ చైతన్యం కోసం శ్రమిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు, కళాశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అర్హులు. దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోపు 'ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయం, డోర్.నం.13/186, రెండో అంతస్తు, జూనియర్ కాలేజ్ ఎదురుగా, ఆర్‌ఎఫ్‌రోడ్డు, అనంతపురం' చిరునామాకు చేరేలా పంపాలి. పూర్తి వివరాలకు 90590 55965, 91602 19998లో సంప్రదించవచ్చు.

పెండింగ్ కేసులు పూర్తి చేయండి

కళ్యాణదుర్గం: పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని సీఐ తేజమూర్తికి అనంతపురం ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం ఆయన కళ్యాణదుర్గం పట్టణ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, కేసులపై ఆరా తీశారు. ఎస్పీ వెంట డీఎస్పీ బి.శ్రీనివాసులు, ఎస్‌ఐలు ఉన్నారు.

ఆటో బోల్తా... ముగ్గురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో కాళ్లు విరిగిన భానుచరణ్, పవన్ కళ్యాణ్

కళ్యాణదుర్గం రూరల్: ఆటో బోల్తాపడిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. కంబదూరు మండలం మర్రిమాకులపల్లి నుంచి ఎనిమిది మంది ప్రయాణికులతో బుధవారం ఉదయం కళ్యాణదుర్గానికి ఆటో బయలుదేరింది. కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్ వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా వచ్చిన పందిని డ్రైవర్ తప్పించబోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో మానిరేవులోని సచివాలయ ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న దాసంపల్లి నివాసి హేమలతతో పాటు బోయలపల్లికి చెందిన పవన్‌కుమార్, భానుచరణ్‌కు కాళ్లు విరిగాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రులను కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుణ్ని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుంతకల్లు టౌన్: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య వెల్లడించారు. గుంతకల్లులోని అరవిందనగర్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి మణికుమార్ ఇంట్లో గత నెల 24న చోరీ జరిగిన విషయం తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చోరీ ఘటనలో ఇద్దరు పాల్గొన్నట్లు నిర్ధారించారు. బుధవారం స్థానిక హనుమాన్ సర్కిల్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న బండారి విజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో మణికుమార్ ఇంట్లో చోరీ చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి 3.5 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇదే కేసులో పరారీలో ఉన్న గుంతకల్లులోని శ్యామ్‌సన్‌పురానికి చెందిన కంసాలి పవన్‌బహదూర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన ఎస్‌ఐ మురహరి బాబు, సిబ్బందిని సీఐ అభినందించారు.

వాహనం ఢీకొని యువకులకు గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన నరసింహ, తేజ బుధవారం సాయంత్రం గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన నడుచుకుంటూ వెళుతుండగా పాలిటెక్నిక్ కళాశాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో ఇద్దరికీ కాళ్లు విరిగాయి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా అనంతపురం వైపు ఉడాయించాడు. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను కళ్యాణదుర్గంలో సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆకతాయిల భరతం పట్టండి

- డీఐజీ అమ్మిరెడ్డి


మాట్లాడుతున్న డీఐజీ ఆర్‌ఎన్ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న ఆకతాయిల భరతం పట్టాలని దిశ పెట్రోలింగ్ సిబ్బందిని డీఐజీ ఆర్‌ఎన్ అమ్మిరెడ్డి ఆదేశించారు. నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్ నుంచి తెలుగుతల్లి కూడలి వరకూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు, యువతులకు రక్షణ దిశగా పని తీరు ఉండాలని దిశ పెట్రోలింగ్ సిబ్బందికి సూచించారు. కళాశాలలు, పాఠశాలలు వదిలే సమయంలో రద్దీ ప్రాంతాలు, కూడళ్లలో అమ్మాయిలపై ఈవ్ టీజింగ్ జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దిశ యాప్, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ అధికంగా ఉన్న కూడళ్లలో స్కూలు పిల్లలు ఇబ్బంది పడకుండా సురక్షితంగా దాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కె.శ్రీనివాసరావు, అదనపు ఎస్పీలు విజయభాస్కర్ రెడ్డి, ఎ.హనుమంతు(ఏఆర్), దిశ డీఎస్పీ ఎం.ఆంథోనప్ప తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

- కుటుంబానికి అండగా ఉంటామన్న అనంత ఎస్పీ శ్రీనివాసరావు


మారెన్న మృతదేహానికి నివాళులర్పిస్తున్న అనంతపురం ఎస్పీ శ్రీనివాసరావు

కంబదూరు: మండలంలోని అండేపల్లి గ్రామానికి చెందిన హోంగార్డు ఎర్ర మారెన్న (41) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం రాత్రి రాయదుర్గం పోలీసుస్టేషన్‌లో విధి నిర్వహణలో ఉండగా ఒక్కసారిగా కుప్పకూలిన ఆయనను తోటి సిబ్బంది వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య నాగమణి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు బుధవారం ఉదయం అండేపల్లి గ్రామానికి చేరుకుని బాధత కుటుంబసభ్యులను పరామర్శించారు. మారెన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మారెన్న భార్య నాగమణికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని భరోసానిచ్చారు. అంత్యక్రియలకు రూ.10 వేల తక్షణ సాయాన్ని అందజేశారు. అలాగే హోంగార్డు వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున రూ.10 వేల ఆర్థిక సాయాన్ని డీఎస్పీ బి.శ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో సీఐలు లక్ష్మణ, శ్రీనివాసులు, ఎస్‌ఐలు రాజేష్, సుధాకర్, ఆర్‌ఎస్‌ఐ మక్బూల్, హోంగార్డు ఇన్‌చార్జ్ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మారెన్న మృతదేహానికి రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, ఎంపీటీసీ మల్లేష్ ఘనంగా నివాళులర్పించారు.